
సాక్షి
గుంటూరు
శుక్రవారం । 6 । జూన్ । 2025



రేమిడిచర్లలో ఘనంగా విగ్రహ ప్రతిష్ట

బొల్లాపల్లి: రేమిడిచర్లలోని ప్రసన్నాంజనేయ స్వామి నూతన విగ్రహ ప్రతిష్ట వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రత్యేక పూజలు చేశారు.



కుడి కాలువకు నీటి నిలుపుదల

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 511.60 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు నీటిని నిలుపుదల చేశారు.



నాగులగుడిలో గోపుర కలశ ప్రతిష్ట

పిడుగురాళ్ల : పిల్లుట్ల రోడ్డులోని నాగులగుడిలో గురువారం గోపుర కలశ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

న్యూస్‌రీల్

పకడ్బందీగా మెగా డీఎస్సీ

- పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక వసతులు, బందోబస్తు కల్పించండి
- సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్



నరసరావుపేట: జిల్లాలో నేటి నుంచి ఈ నెల 30 వరకు నిర్వహించే మెగా డీఎస్సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, పరీక్ష కేంద్రాల వద్ద మౌలికవసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. గురువారం కార్యాలయంలో పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రెండు షిఫ్ట్‌లలో సుమారుగా 18,415 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారన్నారు. మారుమూల ప్రాంతాలనుంచి అభ్యర్థులకు అనువుగా బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని, పరీక్షా కేంద్రాలు తెలిసేలా ప్రధాన కూడళ్లలో సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్డులు అనుమతించడం జరుగుతుందని, పరీక్షకు ఒక గంట ముందుగా అభ్యర్థులు హాజరుకావాలని, నిముషం లేటు అయినా అనుమతించడం జరగదని అన్నారు. అభ్యర్థులు కలర్ ఫొటో అందుబాటులో ఉంచుకోవాలన్నారు. డీఆర్‌ఓ ఏకా మురళి, అదనపు ఎస్పీ జేవీ సంతోష్, ఆర్డీఓ కె.మధులత, డీఈఓ ఎల్.చంద్రకళ, ఇంజినీరింగ్ కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

8న రెడ్ల సత్రం సిల్వర్ జూబ్లీ వేడుకలు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండలోని శ్రీ యోగి వేమారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్, రెడ్ల సత్రం ఏర్పాటై 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు ఈనెల 8వ తేదీ ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు సత్రం కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి , ఎమ్మెల్యేలు బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జూలకంటి బ్రహ్మారెడ్డి, మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి, గాదె వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్ రెడ్డి, యర్రం వెంకటేశ్వరరెడ్డి, ఆళ్ల రామకృష్ణారెడ్డి, టీజీ కృష్ణారెడ్డి, సత్తెనపల్లి వైఎస్సార్ సీపీ కన్వీనర్ డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డిలు పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా రామాలయం వార్షిక వేడుకలు



నకరికల్లు: శ్రీరాంపురంలోని శ్రీరాముల వారి ఆలయ వార్షిక వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. 21వ వార్షిక వేడుకలు పురస్కరించుకొని ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

24 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న 24 మందికి గురువారం గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఆర్డర్స్ ఇచ్చారు. ఈ ప్రక్రియలో మెడికల్ అండ్ హెల్త్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కె.సుచిత్ర, డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్‌లు నాగూర్ షరీఫ్, గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్, సీనియర్‌అసిస్టెంట్ బి.శ్యామ్ అనిల్, పాల్గొన్నారు.

జూలై 26, 27 తేదీలలో టైప్‌రైటింగ్ పరీక్షలు

రేపల్లె: స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ మంగళగిరి వారి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇంగ్లిష్, తెలుగు, హిందీ భాషలలో టైప్‌రైటింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఏపీ టైప్ రైటింగ్ అండ్ షార్ట్ హ్యాండ్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సీవీ మోహనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జులై 26, 27 తేదీలలో లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలను, అదనంగా ఇంగ్లిష్ జూనియర్ గ్రేడ్ పరీక్షలు 36 కేంద్రాలలో నిర్వహించనున్నట్టు తెలిపారు. జులై 12, 13 తేదీలలో తెలుగు, ఇంగ్లిష్ షార్ట్ హ్యాండ్ అన్ని గ్రేడ్‌ల పరీక్షలు 7 కేంద్రాలలో నిర్వహిస్తారు.

నాడు ప్రభుత్వ బడులను కార్పొరేట్‌కు తలదన్నేలా తీర్చిదిద్దగా.. నేడు కూటమి ప్రభుత్వం కార్పొరేట్‌కు దాసోహమంటూ ప్రభుత్వ బడులను నిర్వీర్యం చేస్తోంది. ఐఎఫ్‌పీ విధానం, ట్యాబ్‌లు వంటి వాటితో బడుల్లో డిజిటల్ విద్యకు నాడు ఊపిరిలూదగా.. నేడు వాటన్నింటిని మూలన పడేసి ఊపిరి తీస్తున్నారు. నాడు రూ.కోట్లు వెచ్చించి భవనాలు, మౌలిక వసతులు సమకూర్చగా.. నేడు కొన్ని పాఠశాలల్లో కూర్చునేందుకు బల్లలు సైతం కనిపించని స్థితి. నాడు సకాలంలో జగనన్న విద్యాకానుక, వసతి దీవెన వంటి వాటిని అందించి ఉన్నత విద్యకు ఊతమివ్వగా.. నేడు ఫీజులు కట్టలేదని విద్యార్థులను బయటకు పంపించే దుస్థితి. నాడు ప్రతి ఏటా క్రమంగా అమ్మ ఒడి అందించి పేద విద్యార్థులకు అండగా నిలవగా.. నేడు తల్లికి వందనం ఇదిగో.. అదిగో అంటూ మంగళం పాడిన పరిస్థితి. నాడు వైఎస్ జగన్ హయాంలో ప్రభుత్వం విద్యకు స్వర్ణయుగం కాగా.. నేడు కూటమి హయాంలో విద్యావ్యవస్థ తిరోగమనంలో సాగుతోంది.

ఏడాదిగా తడబడి

కూటమి ఏడాది పాలనలో వెలవెలబోతున్న ప్రభుత్వ విద్య

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

- గత ప్రభుత్వంలో వరుసగా నాలుగేళ్లు నిరాటంకంగా అమ్మఒడి అమలు
- తల్లికి వందనం పేరుతో విద్యార్థుల తల్లులను మోసగించిన కూటమి ప్రభుత్వం
- చదువుకునే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని హామీ
- గుంటూరు జిల్లాలోని విద్యార్థులు, తల్లులకు రూ. 540 కోట్లు బకాయి పడిన కూటమి ప్రభుత్వం
- వైఎస్ జగన్ పాలనలో నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు ప్రాణం
- ఐఎఫ్‌పీలు, ట్యాబ్స్ ద్వారా ఆధునిక విద్యను తెచ్చిన వైఎస్ జగన్
- విద్యాకానుక, గోరుముద్ద కార్యక్రమాలతో విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట
- గతంలో విద్యార్థుల తల్లులకే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు
- నేడు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులకు తిప్పలు



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో నాడు-నేడు ద్వారా రూ.43 లక్షలతో ఆధునికీకరించిన గుంటూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల

గుంటూరు ఎడ్యుకేషన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన చదువుల విప్లవంతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్యను పొందారు. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నే విధంగా డిజిటల్ చదువులను అమల్లోకి తెచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వ పాఠశాలల స్వరూపాన్ని సమూలంగా మార్చివేశారు. తరగతిగదిలో బ్లాక్‌బోర్డుపై రాసిన పాఠ్యాంశాలను చదువుకునే రోజుల నుంచి చేత్తో తాకే తెరపై ప్రపంచం నలుమూలలా దాగి ఉన్న సమస్త విజ్ఞానాన్ని, సమాచారాన్ని తరగతిగదిలోనే అందుకున్నారు. వైఎస్ జగన్ పాలనలో సువర్ణాధ్యాయంగా నిలిచిన ప్రభుత్వ విద్యావ్యవస్థ కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో తిరోగమనం దిశగా పయనిస్తోంది. వైఎస్ జగన్ పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో పైసా ఖర్చు లేని ఉచిత విద్యకు ఇచ్చిన భరోసా ప్రస్తుతం కనుమరుగైంది.

నాడు-నేడుతో చదువుల విప్లవం

ప్రభుత్వ పాఠశాలలను బడుగు, బలహీనవర్గాలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థుల దరికి చేర్చడంలో మాజీ సీఎం వైఎస్ జగన్ విశేష కృషి చేశారు. నాడు - నేడు మొదటి విడతలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 1,183 పాఠశాలలను రూ.283 కోట్ల వ్యయంతో ఆధునికీకరించారు. జిల్లాల పునర్విభజన అనంతరం రెండో దశలో ఒక్క గుంటూరు జిల్లాలోనే 563 స్కూళ్లలో రూ.202 కోట్లతో పనులు మంజూరు చేశారు. వీటిలో దాదాపు 50 శాతానికి పైగా పనులు పూర్తవగా, కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో మిగిలిన పనులు పూర్తి కాలేదు.

175 పాఠశాలల్లో 624 ఐఎఫ్‌పీలు

గత వైఎస్సార్ సీపీ పాలనలో గుంటూరు జిల్లాలోని 175 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన 624 ఐఎఫ్‌పీల ద్వారా విద్యార్థులకు ఆధునిక విద్య అందించారు. ప్రతి క్లాస్‌రూమ్‌కు ఒకటి చొప్పున ఒక్కో పాఠశాలకు ఐదు నుంచి 10 వరకు ఐఎఫ్ ప్యానెల్స్ ఏర్పాటు చేశారు. రూ.1.26 లక్షల వ్యయం కలిగిన అత్యాధునిక ఐఎఫ్‌పీలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాఠశాలల్లో ఏర్పాటు చేసింది.

నేటి కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో కొన్ని పాఠశాలల్లో నిర్వహణ సరిగా లేక అవి మూలన పడ్డాయి.



ఐఎఫ్‌పీపై బోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు (ఫైల్)



నాడు గుంటూరులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులు



జగనన్న విద్యాకానుక కిట్ (ఫైల్)

నాడు పౌష్టికాహారం.. నేడు గుడ్డుమాయం

నాసిరకం బియ్యంతో చాలీచాలనీ కూరలు, నీళ్లను తలపించే సాంబారు స్థానంలో జగనన్న గోరుముద్దను అమల్లోకి తెచ్చింది. వారంలో ఆరు రోజులపాటు విద్యార్థులకు రోజుకో కొత్త మెనూతో బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించింది. నాణ్యమైన ఫోర్టిఫైడ్ బియ్యంతో పాటు ప్రతిరోజూ కోడిగుడ్డు అందిస్తూనే కొత్తగా చిక్కీ, రాగిమాల్ట్ ప్రవేశపెట్టారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా తీర్చిదిద్దిన గోరుముద్ద మెనూ ద్వారా ఇళ్ల దగ్గర నుంచి క్యారేజీలు తెచ్చుకునే విధానానికి స్వస్తి పలికారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు మాయమైంది. నాసిరకం బియ్యం సరఫరా, మెనూ పాటించకపోవడంతో విద్యార్థులు మళ్లీ ఇళ్ల దగ్గర నుంచి క్యారేజీలు తెచ్చుకోవడం ప్రారంభించారు.

ఫీజులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు

గత ప్రభుత్వంలో ఇంజినీరింగ్ కోర్సులకు ఆంక్షలు లేనివిధంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో బీటెక్, ఫార్మసీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా నిలిపివేశాయి. ఫలితంగా ఇటు ఉద్యోగాల్లో చేరే వీలు లేక, అటు ఉన్నత విద్యవైపు వెళ్లేందుకు అవకాశం లేకుండా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– బందెల నాసర్‌జీ, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గుంటూరు

నాడు 'స్మార్ట్' బోధన.. నేడు వేదన

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బ్లాక్‌బోర్డు స్థానంలో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ) ద్వారా విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విద్య అందుతోందంటే అది వైఎస్ జగన్ చలువే. పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు కార్పొరేట్‌కు దీటుగా ఆధునిక వసతులతో తీర్చిదిద్దిన పాఠశాలల్లో అత్యాధునిక సదుపాయాలు నేడు ఉత్తమ ఫలితాలను అందిస్తున్నాయి. గతంలో పాఠశాలల్లో టీవీ ఏర్పాటు చేయడమే గొప్పగా చెప్పుకున్న పరిస్థితుల్లో వందలాదిగా ఐఎఫ్‌పీలను ఏర్పాటు చేసి, సర్కారు బడుల్లో టెక్నాలజీ విద్యను పేద వర్గాలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత వైఎస్ జగన్‌కే సొంతం. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చి సబ్జెక్టు పరమైన విజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక వసతులతో తీర్చిదిద్ది, విద్యార్థులతో కళకళలాడే విధంగా చేసిన ఎన్నో గొప్ప పనులు ఘన చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా మిగిలాయి. నేటి కూటమి ప్రభుత్వం వరుసగా వాటన్నిటికి మంగళం పాడుతూ ప్రభుత్వ విద్యావ్యవస్థను తిరోగమనం వైపు నడిపిస్తోంది.



ట్యాబ్‌లతో విద్యార్థులు (ఫైల్)

విద్యార్థులకు ఆండ్రాయిడ్ ట్యాబ్‌లు

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8వ చదువుతున్న విద్యార్థులకు గత ప్రభుత్వం వరుసగా రెండేళ్ల పాటు 24,608 ఆండ్రాయిడ్ ట్యాబ్‌లను ఉచితంగా పంపిణీ చేసింది.

నేటి కూటమి ప్రభుత్వం వాటి ఊసే ఎత్తడం లేదు.

గత నాలుగేళ్లలో అమ్మఒడి ఆర్థిక లబ్ధి ఇలా

విద్యాసంవత్సరం	తల్లుల సంఖ్య	ఆర్థిక లబ్ధి
2019–20	1,46,232	రూ.219.34 కోట్లు
2020–21	1,55,330	రూ.232.99 కోట్లు
2021–22	,64,601	రూ.246.90 కోట్లు
2022–23	1,59,594	రూ.239.39 కోట్లు



జగనన్న అమ్మఒడి అందుకున్న ఆనందం (ఫైల్)

నేడు తల్లికి మంగళం!

తల్లికి వందనం ద్వారా జిల్లాలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న 3.60 లక్షల మంది విద్యార్థులకు రూ.15వేలు చొప్పున ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించాల్సి ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న మూడు లక్షల మంది విద్యార్థులతో పాటు ఇంటర్ చదువుతున్న విద్యార్థులు 60వేల మంది ఉన్నారు. ఈ విధంగా ఒక్కో విద్యార్థికి రూ.15వేలు చొప్పున రూ.540 కోట్లు బకాయి పడింది.

ఉన్నత చదువులకు ప్రోత్సాహం

వైఎస్ జగన్ పాలనలో విద్యాదీవెన, వసతి దీవెనతో ఉన్నత చదువులకు ఆంక్షలు లేని విధంగా ఫీజులను చెల్లించారు. ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర కోర్సులకు గత 2019కు ముందు టీడీపీ ప్రభుత్వం షరతులతో అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆంక్షలు ఎత్తివేశారు. ఈ విధంగా గుంటూరు జిల్లాలో 2019–20 విద్యాసంవత్సరం నుంచి 2022–23 విద్యాసంవత్సరం వరకు 36,962 మంది విద్యార్థుల చదువులకు గత ప్రభుత్వం రూ.625.55 కోట్లు చెల్లించింది. జగనన్న విదేశీ విద్యాదీవెన ద్వారా గతంలో 42 మంది విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత చదువుల కోసం రూ.3.68 కోట్లు చెల్లించారు.

2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఫీజు బకాయిలు కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా చెల్లింపులకు నోచుకోలేదు. అదే విధంగా విదేశీ చదువులకు సైతం ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు.

పేద్ద మొత్తంలో అవినీతి!

- పే రివిజన్ కమిషనర్ విధానంలో అవకతవకలు
- అధికమొత్తంలో అందుకున్న పలువురు దేవదాయ ఉద్యోగులు
- తిరిగి ఆ మొత్తాన్ని రికవరీ చేసేందుకు రంగం సిద్ధం



గుంటూరులోని దేవదాయశాఖ కార్యాలయం

పట్నంబజారు: గుంటూరు నగరంలోని లాలాపేటలో వేంచేసియున్న శ్రీ వేంటేశ్వరస్వామి గ్రూప్ ఆలయాల పరిధిలో నాజ్ సెంటర్‌లోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం, శ్రీ జగన్నాథ స్వామి ఆలయాలు ఉన్నాయి. అయితే ఈ ఆలయాలకు సంబంధించి పే రివిజన్ కమిషన్ (పీఆర్‌సీ) విధానంలో పలు అవకతవకలు జరిగాయని సమాచారం. 2015కు సంబంధించి సిబ్బందికి ఇవ్వాల్సిన పీఆర్‌సీని 2024లో ఇచ్చారు. అయితే దేవదాయ శాఖకు స్వయంప్రతిపత్తిగా ఉద్యోగులకు జీతాలు ఇచ్చే అవకాశం ఉంది. దీనిలో భాగంగానే పీఆర్‌సీ కూడా ఇవ్వొచ్చని ఆలయ సిబ్బంది చెబుతున్నారు. ఆలయ అధికారిగా పనిచేసిన ఒక వ్యక్తి అత్యుత్సాహం కారణంగా, మొత్తం గ్రూప్ ఆలయాల్లో 19 మంది సిబ్బందికిగానూ.. ఏడుగురికి ఇవ్వాల్సిన దానికంటే అధిక మొత్తాలను వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సదరు అధికారి సిబ్బందిని భయపెట్టి, తిరిగి ఆ మొత్తాన్ని చెల్లిస్తామని లేఖలు రాయించుకున్నట్లు సమాచారం. ఇదే క్రమంలో ఆలయాలకు సంబంధించి వచ్చిన ఆదాయంలో 28 శాతం కంటే అధికంగా ఉంటే పీఆర్‌సీలు ఇచ్చేందుకు వీలు లేదని చెబుతున్నారు. 2020 సంవత్సరంలో ఆరుగురు అర్చకుల నుంచి భారీ మొత్తంలో వసూళ్లకు పాల్పడి పెద్ద ఎత్తున పీఆర్‌సీలు ఇవ్వటంతో గ్రూప్ ఆలయాల ఖర్చు 52 శాతానికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ప్రస్తుతం ఆలయ అధికారిగా వ్యవహరిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) అధిక శాతం పీఆర్‌సీ పడిన వారి నుంచి తిరిగి ఆ మొత్తాన్ని వసూలు చేసేందుకు రంగం సిద్ధం చేశారని తెలిసింది. నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. గతంలో పనిచేసిన సదరు అధికారి తప్పిదాన్ని ఆడిట్ అధికారులు ఆక్షేపించినట్లు ఆలయ సిబ్బంది చెబుతున్నారు. ఆలయాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు భక్తులకు మరింత తలనొప్పి తెచ్చి పెడుతోంది. ముఖ్యంగా ఆంజనేయస్వామి ఆలయంలో లడ్డు, ఇతర పూజలకు సంబంధించి టోకెన్లు కొట్టే వ్యక్తి ఉదయం 8 గంటలకు రాకపోవటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిసింది. ఈ విషయాన్ని ఆలయంలో సిబ్బందే చెబుతున్నారు.

నేను ఇంకా చూడలేదు

నేను ఇంకా ఈ అంశంపై దృష్టి పెట్టలేదు. స్పష్టంగా మీకు కావాల్సింది పేపరుపై రాసి ఇస్తే.. కావాల్సిన సమాచారం ఇస్తాం. ఆడిట్ ఆక్షేపించిన అంశం నాకు తెలియదు. ప్రస్తుతానికి నోటీసులు వరకు రాలేదు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం బకాయిలు చెల్లించే అంశాన్ని పరిశీలిస్తున్నాం. ఆడిట్ అబ్జక్షన్స్ ఉంటే కచ్చితంగా దానిపై దృష్టి సారిస్తాం. – టి. సుభద్ర ఏసీ, లాలాపేట గ్రూప్ ఆలయాలు

'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి

విశేష ప్రజా స్పందన

- పోలీస్ యంత్రాంగంతో అడ్డుకునేందుకు ప్రయత్నాలు
- సంబరాలకు పిలుపునిచ్చి అభాసుపాలైన కూటమి ప్రభుత్వం
- తుని రైలు దుర్ఘటన కేసు విషయంలో తోకముడిచిన చంద్రబాబు
- వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

నగరంపాలెం: కూటమి ప్రభుత్వ మోసాలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ బుధవారం నిర్వహించిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని పోలీస్ యంత్రాంగంతో అడ్డుకునేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేశారని మాజీ మంత్రి, పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. గుంటూరు సిద్ధార్థనగర్‌లోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి పార్టీల దివాలాకోరుతనం బయటపడకుండా, వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విఫలం చేసేందుకు పోలీస్ యంత్రాంగాన్ని ప్రయోగించారని మండిపడ్డారు. మరోవైపు పోటీగా దీపావళి, సంక్రాంతి అంటూ సంబరాలు చేసుకోవాలని కూటమి ఇచ్చిన పిలుపును రాష్ట్ర ప్రజలు తిప్పికొట్టారని అన్నారు. తన ఇంటి వద్ద పోలీసులను మోహరించి నాయకులను, కార్యకర్తలను భయపెట్టాలని చూశారని అన్నారు. పట్టాభిపురం పీఎస్ సీఐతో చిన్నపాటి వాగ్వాదం అనివార్యంగా జరిగిందని అన్నారు.

తుని ఘటనపై జీఓ పేరుతో నాటకం

తుని ఘటనపై కేసుల పేరుతో ప్రభుత్వం కొత్త నాటకం ఆడిందని ఆరోపించారు. గతంలో టీడీపీ హయాంలో జరిగిన తుని ఘటన కేసులపై అప్పీలు చేసి ముద్దాయిలను శిక్షించాలని ప్రయత్నించారని అన్నారు. అయితే కాపు సమాజం నుంచి వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గిందని చెప్పారు.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 1,000 గరిష్టం : రూ. 1,800

మోడల్ ధర రూ. 1,400



పసుపు ధరలు
(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 205

కొమ్ములు : 98 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,500	10,200	10,000

కాయలు : 107 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,500	10,250	10,000

మొత్తం అమ్మకాలు : 153.750 క్వింటాళ్లు

–దుగ్గిరాల

క్లుప్తంగా

జిల్లా స్థాయి సీనియర్ చెస్ విజేత ధ్రువేష్



గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి సీనియర్ ఓపెన్ చెస్ పోటీల్లో విజేతగా డి.ధ్రువేష్ నిలిచాడు. ఆ తర్వాత మూడు స్థానాల్లో కె.హర్షవర్ధన్, ఎ.హరిసూర్యనారాయణ, కీర్తి రానా నిలిచారు. ఈ నెల 7, 8 వ తేదీల్లో విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ నలుగురు పాల్గొంటారని పోటీల నిర్వాహకుడు వైవీకే చక్రవర్తి తెలిపారు. అనంతరం విజేతలకు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్ర రాజు, హిందూ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి రామకృష్ణ మూర్తి, చక్రవర్తిలు బహుమతి ప్రదానం చేశారు.

నేడు సత్తెనపల్లిలో సీఐటీయూ మహాసభ

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సీఐటీయూ) 4వ రాష్ట్ర మహాసభ పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో గల పుతుంబాక వెంకటపతి భవన్ నందు శుక్రవారం నిర్వహించడం జరుగుతుందని వీఆర్ఏల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బందగీ సాహెబ్ గురువారం తెలిపారు. వీఆర్ఏల 4వ రాష్ట్ర మహాసభకు ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు హాజరవుతారన్నారు. ముఖ్యంగా ఈ 4వ రాష్ట్ర మహాసభలో వీఆర్ఏల సమస్యలు తదితర అంశాల మీద చర్చ జరుగుతుందన్నారు.

జీడీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మక్కెన మల్లికార్జునరావు



విద్యుత్ సరఫరా లేక సెల్‌ఫోన్ లైట్, మీడియా వారి లైట్ల సహాయంతో మాట్లాడుతున్న మంత్రి



బాధ్యతలు స్వీకరిస్తున్న వడ్రాణం హరిబాబు

నగరంపాలెం: గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (జీడీసీసీబీ) పర్సన్ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు గురువారం గుంటూరు బ్రాడీపేటలోని జీడీసీసీబీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మల్లికార్జునరావు మీడియాతో మాట్లాడుతూ రైతులకు రుణాల మంజూరులో సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రైతులకు మేలు చేయాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. వ్యవసాయ శాఖ ద్వారా నల్ల బెర్లీ పొగాకుపై రైతులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. విత్తనాలు అందించేందుకు ప్రభుత్వ సహకారం ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, భాష్యం ప్రవీణ్, టీటీడీ సభ్యుడు జంగా కృష్ణమూర్తి, టీడీపీ నాయకులు నన్నపనేని రాజకుమారి, బ్యాంక్ ఉన్నతాధికారులు హాజరయ్యారు. అయితే మంత్రి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడే సమయంలో ఒకట్రెండు సార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆయన మీడియా, సెల్‌ఫోన్ లైట్ల వెలుగులో మాట్లాడారు. ఆ తర్వాత కూడా పలుమార్లు విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో వచ్చిన వారు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు.

రైతులకు సేవ చేస్తా..

రైతులకు సేవ చేస్తానని గుంటూరు జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి వడ్రాణం హరిబాబు అన్నారు. గుంటూరు కన్నవారితోటలోని జీడీసీఎంఎస్ కార్యాలయంలో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. సొసైటీ ద్వారా రైతులకు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందిస్తామన్నారు. గిట్టుబాట ధర కల్పించేలా చూస్తామని చెప్పారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ టీడీపీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలుకు ఎలక్ట్రికల్ బస్సుల పెంపుదల, అదనపు సిబ్బందిని నియమిస్తామని అన్నారు. అనంతరం హరిబాబుని మంత్రి అచ్చెన్నాయుడు, పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు అభినందించారు.

కౌలు రైతులకు రుణాలు పెంచాలి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ

గుంటూరు వెస్ట్: జిల్లాలో కౌలు రైతులకు ఇవ్వాల్సిన రుణ లక్ష్యాలను ఆశించిన స్థాయిలో బ్యాంకర్లు పూర్తి చేయలేదని, దీన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో 2025 త్రైమాసికానికి సంబంధించి డీసీసీ, డీఎల్‌ఆర్సీ బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ కౌలు రైతులకు రూ. 180 కోట్ల రుణ లక్ష్యం కాగా, రూ. 60 కోట్లు మాత్రమే మంజూరు చేశారన్నారు. దీన్ని మరింత పెంచి పెండింగ్ రుణాలు అందించాలన్నారు. విద్య, గృహ రుణాలు పెంచేందుకు బ్యాంకర్లు, విద్యా సంస్థలు, ఇంజినీరింగ్ కళాశాలలు, తదితర రద్దీ ప్రాంతాల్లో రుణ మేళా నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్న పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ప్రతి ఇంటిపైన సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సహించాలన్నారు. దీనిలో భాగంగా కనీసం రూ. 20 వేల మందికి రుణాలు ఇవ్వాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు పీఎం విశ్వకర్మ, పీఎం ఈజీసీఎం, పీఎంఎఫ్ ఎంజీ, ముద్ర రుణ లక్ష్యాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. గత ఆర్థిక సంవత్సరం 2024–25 కు సంబంధించి వ్యవసాయ రంగానికి రూ.13,613 కోట్ల రుణ లక్ష్యం కాగా, రూ.16,266 కోట్లు అంటే 119 శాతం మంజూరు చేశారన్నారు. ఎంఎస్ఎంఈ రంగానికి రూ. 9,495 కోట్లు రుణ లక్ష్యం కాగా, రూ. 10,679 కోట్లు అంటే 112 శాతం మంజూరు చేశారన్నారు. ప్రాధాన్యత రంగానికి సంబంధించి విద్యా రుణాలు రూ.114.5 కోట్లు లక్ష్యం కాగా, రూ.95.87 కోట్లు మంజూరు చేశారన్నారు. గృహ రుణాలు మాత్రం ఆశించిన స్థాయిలో లేవని అసహనం వ్యక్తం చేశారు. దీనిలో రూ.664 కోట్లు లక్ష్యం నిర్ణయిస్తే, రూ.182 కోట్లు అంటే కేవలం 27.5 శాతం మాత్రమే మంజూరు చేశారని తెలిపారు. మొత్తం వార్షిక రుణ లక్ష్యం రూ.34,730 కోట్లకు గాను, రూ.44,918 కోట్లు అంటే రూ.129 కోట్లు మంజూరు చేసి రుణ లక్ష్యాలను దాటినందుకు బ్యాంకర్లను అభినందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం జిల్లాకు సంబంధించి నాబార్డు పీఎల్‌పీ 2025 –26 పుస్తకాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, యూడీఐ రీజనల్ హెడ్ జవహర్, జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ మహిపాల్‌రెడ్డి, నాబార్డు డీడీఎం శరత్, ఏడీఏ వెంకటేశ్వర్లు, ఆర్‌బీఐ ఎల్డీవో నవీన్‌లు ఆవిష్కరించారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ



మొక్క నాటుతున్న డీఆర్ఎం సుధేష్ఠ సేన్



కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు తదితరులు

లక్ష్మీపురం: పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే లక్ష్యంతో గుంటూరు రైల్వే స్టేషన్‌లో వేడుకలు నిర్వహించామని డీఆర్ఎం సుధేష్ఠ సేన్ అన్నారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఒకటో ప్లాట్‌ఫాంపై ప్రయాణికులకు అవగాహన కలిగించారు. ర్యాలీ చేపట్టి, నాటకం ప్రదర్శించారు. డివిజన్ అధికారులు, ప్రయాణికులతో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. డీఆర్ఎం మాట్లాడుతూ పర్యావరణ అనుకూల అలవాట్లను నేర్చుకోవాలన్నారు. అనంతరం నల్లపాడులోని మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం కె.సైమన్, సీనియర్ డీఈఎన్ జె.వి. అనూష, సీనియర్ డీఎంఈ ఎం.రవికిరణ్, సీనియన్ డీసీఎం డాక్టర్ సీహెచ్ ప్రదీప్, డీఎస్‌సీ మధుసూదన రావు, సీనియర్ డీఈఈ జి.సూర్యనారాయణ, పి.రవితేజ తదితరులు పాల్గొన్నారు.

లాంఫాంలో వన మహోత్సవం

గుంటూరు రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగర శివారులోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధంపై గురువారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఆర్ డాక్టర్ దుర్గా ప్రసాద్, శాస్త్రవేత్తలు పరిశోధన స్థానంలో మొక్కలు నాటారు. ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్న తరుణంలో విత్తనం ఎంపిక విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయా ప్రాంతాలకు అనువైన విత్తనాలను లైసెన్స్‌డ్ డీలర్ల వద్ద , లేదా వ్యవసాయ శాఖ, లేదా యూనివర్సిటీ వద్ద మాత్రమే పొందాలన్నారు. ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు పరిశీలనలో ఉన్న కంది రకం ఎల్‌ఆర్‌జీ 494 ను అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పొన్నూరు: పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన షేక్ సైదా(30) పొన్నూరులో సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతని కుటుంబంలో విభేదాల కారణంగా మూడేళ్లుగా భార్యకు దూరంగా ఉంటున్నాడు. పట్టణంలో పనులు చేసుకుంటూ రాత్రి వేళల్లో సెంటర్‌లోని ఓ లాడ్జిలో ఉంటున్నాడు. ఉదయం లాడ్జి కింద గాయాలతో పడి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ మేరకు వారు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు. సైదా లాడ్జి పైనుంచి జారిపడి మరణించాడా.. గొడవ నేపథ్యంలో మృతి చెందాడా అనే అనుమానాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లిన కారు



దుగ్గిరాల: డ్రైవరు మద్యం మత్తులో ఉండగా అదుపు తప్పిన కారు కాలువలోకి దూసుకెళ్లింది. దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో గురువారం మధ్యాహ్నం చిలువూరు నుంచి కె.ఆర్.కొండూరు గ్రామం వైపు కారు వేగంగా వెళుతోంది. ఈ క్రమంలో అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. స్థానికులు చూసి కారులోని డ్రైవరును బయటకు తీశారు. అతడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. చిలువూరులో పక్కపక్కనే రెండు మద్యం దుకాణాలు ఉండటం వల్ల కొందరు నిత్యం మద్యం తాగి వేగంగా ద్విచక్రవాహనాలు, కార్లను నడుపుతున్నారని స్థానికులు చెప్పారు. పలువురు ప్రమాదానికి గురవుతున్నారని తెలిపారు. అధికారులకు అనేకసార్లు ఇక్కడ మద్యం దుకాణాలు తొలగించాలని కోరినా స్పందించలేదని పేర్కొన్నారు.

ఆధునిక వ్యవసాయ విధానంతో అధిక దిగుబడులు

కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

పెదకూరపాడు: ఆధునిక వ్యవసాయ విధానం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్లు చెప్పారు. కృషి విజ్ఞాన్ కేంద్రం వారి ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప యాత్ర పెదకూరపాడులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతుల గురించి వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం లాంఫాం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గంగాదేవి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వ్యవసాయం, అనుబంధ రంగాల పథకాల గురించి వివరించారు. ఈనామ్ పోర్టల్ వినియోగం, కిసాన్ సారథి టోల్ ఫ్రీనెంబరు గురించి వివరించారు. ఉద్యానశాఖలో అమలవుతున్న పండ్ల తోటలు, పూల తోటలకు ఇచ్చే సబ్సిడీల వివరాలను ఉద్యాన శాఖాధికారి యు.శ్రీ నిత్య వివరించారు. పశు సంవర్ధకశాఖ పథకాలను గురించి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ పి.శ్రీదేవి తెలిపారు. వ్యవసాయ శాఖలో అమలవుతున్న పీఎం కిసాన్ మట్టి నమూనాల సేకరణ, 50 శాతం రాయితీపై పచ్చిరొట్టి విత్తనాలు పంపిణీ, వ్యవసాయ యాంత్రీకరణ మొదలైన పథకాల గురించి ఏవో ఐ. శాంతి తెలిపారు. జీవ శిలీంద్ర నాశిని అయిన ట్రైకోడెర్మావిరిడి ప్యాకెట్లను కృషి విజ్ఞాన కేంద్రం, లాంఫాం శాస్త్రవేత్తలు రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు బి.జ్యోతి, పి.ధనలక్ష్మీ ,షేక్ హసన్ బాజీ పాల్గొన్నారు.

బంగారం కోసమే వృద్ధురాలి హత్య

తెనాలి ముత్తెంశెట్టిపాలెం కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు

తెనాలి రూరల్: తెనాలి ముత్తెంశెట్టిపాలెంలో ఈ నెల 3వ తేదీ తెల్లవారుజామున వృద్ధురాలి హత్య కేసును పోలీసులు 48 గంటల్లోనే ఛేదించారు. హత్యకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. తెనాలి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ బి. జనార్దనరావు వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. ముత్తెంశెట్టిపాలెంలో తాడిపత్రి మల్లీశ్వరి టిఫిన్ బండి నిర్వహిస్తూ ఒంటరిగా జీవిస్తోంది. కుమార్తె, కుమారుడికి వివాహాలయ్యాయి. వారు ఇదే ప్రాంతంలో వేర్వేరుగా ఉంటున్నారు. ఒంటరిగా ఉంటున్న మల్లీశ్వరి బంగారు ఆభరణాలను ధరించి ఉండడాన్ని ఆమె ఇంటి పక్కనే నివసిస్తున్న 24 ఏళ్ల నన్నెపాముల తారక జోషి గమనించాడు. ఇతడు గతంలో బాపట్ల జిల్లా నగరం మండలం ధూళిపూడి గ్రామంలో నివసించేవాడు. వివాహమై, చెడు వ్యసనాలతో అప్పులపాలైన అతను ఆ ఆభరణాలను దోచుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకు తన తమ్ముడు సతీష్‌కుమార్ సహాయం తీసుకున్నాడు. 3వ తేదీ తెల్లవారుజామున ఐదు గంటలకు మల్లీశ్వరి నీళ్ల కోసం పంపు వద్దకు రాగా ఆమెను గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని ఇంట్లోకి తీసుకెళ్లి మంచంపై పడుకోబెట్టారు. బంగారు ఆభరణాలను చోరీ చేశారు. ఆ బంగారంలో కొంత తారక జోషి తనకు పరిచయమున్న సంగంజాగర్లమూడి గ్రామానికి చెందిన మహిళ గాజులవర్తి కీర్తికి ఇచ్చాడు. అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను విచారిస్తున్న క్రమంలో చిక్కిన నిందితులు నేరానికి పాల్పడినట్టు గుర్తించారు. ఆ ఆభరణాలను ఆమె తాకట్టు పెట్టిందని, వాటిని స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. కేసును 48 గంటల్లో ఛేదించిన వన్ టౌన్ సీఐ మల్లికార్జునరావు, సిబ్బందిని ఆయన అభినందించారు.

16 మందికి హెడ్ నర్సులుగా ఉద్యోగోన్నతి



ప్రమోషన్ ఉత్తర్వులు అందుకుంటున్న నర్సింగ్ సిబ్బంది

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో స్టాఫ్ నర్సులుగా పనిచేస్తున్న 16 మందికి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించి హెడ్ నర్సులుగా ప్రమోషన్ ఉత్తర్వులు ఇచ్చారు. గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయంలో జరిగిన కౌన్సెలింగ్‌కు 17 మంది స్టాఫ్ నర్సులను ప్రమోషన్ కోసం పిలువగా, ఒకరు ప్రమోషన్ వద్దని లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారు. ప్రమోషన్ ద్వారా గుంటూరు జీజీహెచ్‌లో ఎనిమిది మంది, ఒంగోలు జీజీహెచ్‌లో ఐదుగురు, నెల్లూరు జిల్లాలో ముగ్గురు హెడ్ నర్సులుగా చేరారు. సుమారు ఆరు నెలలుగా ప్రమోషన్ల కోసం ఎదురు చూస్తున్న నర్సింగ్ సిబ్బంది ఎట్టకేలకు కౌన్సెలింగ్ జరగడంతో నర్సింగ్ యూనియన్ నేతలతో కలిసి గురువారం మెడికల్ అండ్ హెల్త్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కె.సుచిత్రాదేవిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో ఆర్డీతోపాటు, డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్ షేక్ నాగూర్ షరీఫ్, సీనియర్ అసిస్టెంట్ సుబ్బారావు పాల్గొన్నారు. ఆర్డీకి కృతజ్ఞతలు తెలిపిన వారిలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా సెక్రటరీ వెల్లంపల్లి పద్మజ, వైస్ ప్రెసిడెంట్ శ్రీదేవి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు సునీత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యతకు మొక్కలు నాటాలి

అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం. లావణ్య



మొక్క నాటుతున్న ఎం. లావణ్య

నరసరావుపేట టౌన్: పర్యావరణ సమతుల్యం కోసం మొక్కలు నాటాలని అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం. లావణ్య సూచించారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవ సందర్భంగా గురువారం రాష్ట్ర జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు స్థానిక న్యాయస్థానం ఆవరణలో పర్యావరణ పరిరక్షణపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని ప్రసంగించారు. మొక్కలు నాటి వాటి సంరక్షణ చర్యలు చేపట్టాలనీ, కాలుష్యాన్ని నివారించడం కోసం అందరమూ కృషి చేయాలన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి సంరక్షించడంతోపాటు ప్లాస్టిక్ బ్యాగ్‌ల వాడకాన్ని నివారించాలన్నారు. అనంతరం న్యాయస్థాన భవనాల ఆవరణలో న్యాయాధికారి లావణ్య మొక్కలు నాటారు. కార్యక్రమంలో పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, కోర్ట్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకుని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఐ ఎం.వి. చరణ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ లోకనాథ్, ఎస్ఐలు కిషోర్, అశోక్ సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లాకు మంచి పేరు తీసుకురండి



ఎంపికైన జిల్లాస్థాయి సబ్ జూనియర్స్, జూనియర్స్ బాలబాలికల ఫుట్‌బాల్ జట్లతో మాబు హుస్సేన్, సుబ్రహ్మణ్యేశ్వరరావు, పీడీలు

సత్తెనపల్లి: క్రీడాకారులు క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాబు హుస్సేన్ అన్నారు. స్థానిక సుగాలీకాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పల్నాడు జిల్లాస్థాయి సబ్ జూనియర్స్, జూనియర్స్ బాల బాలికల ఫుట్‌బాల్ సెలక్షన్ ట్రయల్స్ గురువారం జరిగాయి. ఈ సెలక్షన్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 70 మంది బాలురు, 50 మంది బాలికలు ఫుట్‌బాల్ క్రీడలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడాకారులు విజయమే లక్ష్యంగా పెట్టుకొని రాణించాలన్నారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీరామ్ రెడ్డి, అచ్చిరెడ్డి, మహబూబ్ సుభాని, నరసింహారావులు మాబు హుస్సేన్‌ను ఘనంగా సత్కరించారు. పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాకు సెలెక్ట్ అయిన ఫుట్‌బాల్ క్రీడాకారులు త్వరలో జరిగే స్టేట్ మీట్‌లో పాల్గొంటారన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లా సబ్ జూనియర్స్, జూనియర్స్ బాల, బాలికల జట్లను ప్రకటించారు.